# చిట్టి కథ




## తలనీలాలు తెచ్చిన తిప్పలు

సుకేశినికి పేరుకు తగ్గట్టే నల్లగా వంకీలు తిరిగిన బారెడు జుట్టు ఉంది. అందమైన కళ్ళున్నాయి. బి. ఏ. వరకు చదివింది. కాని సామాన్య కుటుంబానికి చెందినది. వరకట్నం ఎంత నిషేధింపబడుతున్నా, కట్నం ఇచ్చుకోలేని తల్లిదండ్రులు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయలేకపోతున్నారు ఈ రోజుల్లో. అందమైన సుకేశినికి ఆ కారణంగానే పెళ్ళి కుదరడం కష్టమయింది. పిల్ల నచ్చినా ఇచ్చే కట్నం నచ్చక ఏదో వంకతో వెళ్ళిపోయేవారు చూడవచ్చిన పెళ్ళివారు. ఆఖరుకు ఎలాగయితేనేం - కృష్ణారావుతో పెళ్లి కుదిరింది. కృష్ణారావు అందగాడే. సుకేశినిచేత మొదటి చూపులోనే ఆకర్షింపబడ్డాడు. ముఖ్యంగా సుకేశిని నల్లని బారెడు జడ చాలా నచ్చింది కృష్ణారావుకు. 'పిల్ల నచ్చింది నెల రోజుల్లో ముహూర్తాలు పెట్టించ'మని తెలిపారు కృష్ణారావు తల్లిదండ్రులు.

"సుకేశినికి పెళ్ళి కుదిరితే నా మనవరాలి తలనీలాలు సమర్పిస్తా స్వామి" అంటూ యాదగిరి లక్ష్మీనృసింహస్వామికి మొక్కుకున్నదట సుకేశిని బామ్మగారు. చావు కబురు చల్లగా చెప్పినట్లు తన కోరిక బయటపెట్టారు బామ్మగారు. సుకేశిని గుండెల్లో రాయి పడింది. "అదేమిటి బామ్మా! నీవి ఇస్తానని మ్రొక్కినా బాగుండేది. నాకు నెల రోజుల్లో పెళ్ళి. ఇంత అందమైన జడ ఇచ్చి మా వారి ముందుకెలా వెళ్ళేది? నీ చాదస్తంతో నాకు ముప్పు తెచ్చావు" అంటూ వాపోయింది సుకేశిని.

బామ్మగారు వెనకటి మనిషి. దేవుడు, మొక్కులు అంటే నమ్మకం. మనుమరాలి పెళ్ళి చూడకుండా చచ్చిపోతానేమో అనే భయంతో అలా మ్రొక్కింది. "సరే బామ్మా - పెళ్ళి జరిగాక మా వారికి నచ్చజెప్పి అలాగే ఇస్తాలే" అన్నది సుకేశిని. "అమ్మో! పెళ్ళి కుదరగానే మ్రొక్కు చెల్లిస్తానన్నాను. పెళ్ళిలో ఇంకేమైనా అడ్డంకులొస్తే! ఎలాగైనా ముందే మొక్కు చెల్లించాలి" అని పట్టుబట్టింది బామ్మగారు. కొడుకు కోడలు నచ్చచెప్పినా లాభం లేకపోయింది. మొక్కు చెల్లించకపోతే గుండె పగిలి పెళ్ళికి ముందే చస్తానని భయపెట్టింది. విధిలేక ఒప్పుకొంది సుకేశిని.

మరునాడు యాదగిరి గుట్టకు వెళ్ళి మొక్కు తీర్చి వచ్చింది. స్నేహితురాళ్ళ సలహాతో తనకు సరిపోయే కృత్రిమ విగ్గును జడతో సహా ధరించింది. తను అంతకుముందు ఎలా ఉందో అలానే ఉంది ఆ జడ. కాని తన రహస్యం పెళ్ళిలో బయటపడితే పెళ్ళివారి ముందు అపహాస్యం కావలసి వస్తుందనే భయం మనస్సులో పీడిస్తూంది. అనుకున్న రోజు రానే వచ్చింది. పెళ్ళి జరగనూ జరిగింది. "కొంగు జడ మీదుగా కప్పుకో అమ్మాయి, అందరి కళ్ళు నీ జడ మీదనే. దిష్టి తగులుతుంది" అని అత్తగారు అంటుంటే గిల్టీగా ఫీలయింది సుకేశిని.

ఆ రాత్రే శోభనం ఏర్పాటు చేశారు. ఇంతవరకు దాచిన రహస్యం కృష్ణారావు ముందు ఎలా దాచాలి, బయటపడితే ఎంత సిగ్గుచేటు! ఈ గండం ఎలా గడుస్తుందో అనే భయం మనస్సులో చోటు చేసుకుంది సుకేశినికి. అనుకున్న ఘడియ రానేవచ్చింది. పేరంటాళ్ళు గదిలోకి త్రోసి తలుపు పెట్టారు. మల్లె పూలతో అల్లిన జడ, తెల్లచీర, సుకేశిని దివి నుండి భువికి దిగివచ్చిన దేవకన్యలా ఉంది. "అదేమిటోయ్! అలా సిగ్గువడతావు ఈ రోజుల్లో కూడా" అంటూ సుకేశినిని సమీపించాడు కృష్ణారావు. స్పృహ తప్పుతానేమో అన్నంత భయంతో కళ్ళు మూసుకుంది సుకేశిని. "ఉంగరాల జుట్టుదానా ఊరించే కన్నులదానా" అంటూ సుకేశిని జడను చేతుల్లోకి తీసుకుని, "ఈ కురులతో ఆడుకోవాలని నెలరోజుల నుండి కలలు కంటున్నాను" అంటూ జడను తన మెడకు గట్టిగా చుట్టుకొన్నాడు కృష్ణారావు. అంతే విగ్గుతో సహా సుకేశిని జడ కృష్ణారావు చేతుల్లోకి వచ్చింది!

సుకేశినికి సిగ్గుతో చచ్చినంత పనయ్యింది.

"మీరు కలలు కన్నట్టు నాది అందమైన, పొడుగైన జడే, కాని" అంటూ పెళ్లి ముందు జరిగిన సంగతంతా ఏకరువు పెట్టింది సుకేశిని. "జరిగిన దానికి నీవేం చేస్తావ్ ఆ సంగతి ముందే చెప్తే ఇలా కలలు కనేవాణ్ణి కానోయ్." అని విగ్గును యథావిధిగా పెట్టుకోమని, దగ్గరికి తీసుకున్నాడు సుకేశినిని.

క్రొత్తగా కలలు పండించుకొనే రోజు ఏం రాద్ధాంతం జరుగుతుందో! భర్త మనస్సు గాయపడితే ఎలా అని భయపడ్డ సుకేశినికి భర్త యింత సులభంగా రాజీపడడం ఆశ్చర్యం కలుగజేసింది. ఎలాగయితేనేం గండం గడిచిపోయింది అనుకుంది.

మధ్యరాత్రి మెలకువ రాగా అటు తిరిగి పడుకున్న భర్తను చూసి పులిక్కిపడింది సుకేశిని. సినిమా క్రాఫింగ్ లాటి విగ్గు ఒకవైపు, బోడి గుండుతో కృష్ణారావు ఒకవైపు. అప్పుడే మేల్కొన్న కృష్ణారావు 'అదేమిటోయ్! నిద్రపోలేదా' అంటూ తల సవరించుకొన్నాడు. నున్నగా తల తాకింది. నవ్వుతూ సుకేశినికి తను 5, 6 రోజుల క్రితమే అనుకోకుండా తిరుపతి వెళ్ళానని, అంత దూరం వెళ్ళి తలనీలాలు సమర్పించకుంటే బాగుండదని ఇచ్చి వచ్చానని, పెళ్ళిలో బోడితలతో ఉంటే బాగుండదని విగ్గు తగిలించానని, చెపితే నవ్వుతావని రహస్యం దాచానని తన గోడు వెళ్ళబోసుకున్నాడు. ఈసారి నవ్వడం, ఆశ్చర్యపోవడం సుకేశిని వంతయింది.

— దేవులపల్లి శిరీష